
# సామ్యవాదం

- వి. పద్మప్రియ





సాయంత్రం నేను ఇంటికి వచ్చేసరికి మా ఆవిడ మొహం చాలా అప్రసన్నంగా, మాడిపోయి కనిపించింది. సంగతేమిటని నేను అడుగుతానని కాసేపు ఎదురు చూసి, ఇక లాభంలేదని తనే చెప్పేసింది.

"చూశారా? ఎదురింటావిడ కలర్ టీ.వీ. కొంది."

"అలాగా?" అన్నాను సాధారణ విషయం విన్నట్టుగా.

"ఎంత పొగరో చూశారా? పొద్దున్నెప్పుడో టీ.వీ. ఇంటి కొస్తే, ఇంతవరకూ మర్యాద క్కూడా వచ్చి చూడమని పిలవలేదు. ఈ వీధి మొత్తానికి ఇప్పుడు ఆవిడ కొక్కదానికే గదా కలర్ టీ.వీ. ఉన్నదీ? అందుకే అంత గర్వం. మనలాంటి వాళ్ళు ఆవిడ కంటికి ఆనతారా?"

"ఇంకా ప్రసారాలు రావటానికి టైముందిగా? పిలుస్తుందేమోలే" అన్నాను.

"ఏడిసింది. అది పిలిస్తే మాత్రం వెళ్ళటానికి ఇక్కడ ఎవరు సిద్ధంగా ఉన్నారు? అలాంటి అహంకారుల ఇంటికి చస్తే వెళ్ళను నేను" అంది మా ఆవిడ.

నే నన్నట్లుగానే మరో అరగంట తరువాత ఎదురింటావిడ మా ఇంటికి వచ్చి - "ఇవ్వాళ చిత్రలహరి తొందరగానే మొదలవుతుందట. రండి సరదాగా చూద్దురుగాని. అన్నయ్యగార్ని కూడా రమ్మని చెప్పండి" అంది మా ఆవిడతో.

అంతవరకూ ఉన్న కోపం ఏమైందో నిండుగా నవ్వుతూ - "సరేలెండి, ఇంతకీ ఎంతయిందేమిటి. టీ.వీ?" అంటూ వివరాలలోకి దిగింది మా ఆవిడ.

చిత్రలహరి ఇంకో పావుగంటకి మొదలవుతుందనగా అటూ ఇటూ పచార్లు చేస్తూ, "రమ్మని పిలిచిందనుకోండి. అంతమాత్రాన వెళ్ళిపోతే లోకువగా ఉంటుందేమో ననిపిస్తోందండీ. అలా అని వెళ్ళకపోతే గర్వం అనుకుంటారు. ఏం చెయ్యమంటారు?" అని నన్ను సలహా అడిగింది.

"నీ ఇష్టం" అని తనకి నచ్చే సలహా ఇచ్చాను.

కాసేపలాగే తచ్చాడి, "సర్లెండి. ఓసా రలా కనబడి వచ్చేస్తాను. లేకపోతే బావుండదు" అని గబగబా వెళ్ళిపోయింది. కాసేపట్లో వస్తానని వెళ్ళిన మనిషి గంటన్నర తరువాత గానీ రాలేదు.

రాగానే అడిగాను ఎలా ఉన్నాయి రంగులని.

"ఆ, నా మొహంలా ఉంది టీ.వీ. ఆ రంగులూ అవీ ముద్దలు ముద్దలుగా, తలనెప్పి వచ్చేసింది బాబూ చూడలేక. హాయిగా బ్లాక్ అండ్ వైట్ టీ.వీ. చూసినంత సుఖం ఎందులోనూ లేదు. ఇంతోటి దానికీ పది వేలు తగలేసిందట" అంది పెదవి విరుస్తూ.

పైకి అలా అందే గానీ మా బ్లాక్ అండ్ వైట్ టీ.వీ. వైపు పదే పదే అదోలా చూస్తూ, తనలో తనే ఏదో మథనపడటం నేను గమనించకపోలేదు.

రెండు రోజులు ఎదురింటి వాళ్ళమీద, వాళ్ళ కలర్ టీ.వీ.మీద నా దగ్గర దుమ్మెత్తి పోసిన తను మరో రెండు రోజుల తరువాత భోంచేస్తున్న సమయంలో మెల్లగా-

"అనుకుంటాం గానీ ఎంతయినా కొన్ని దృశ్యాలూ, అవీ కలర్ టీ.వీ.లోనే

> "నా భార్యకు భయంకరమైన జ్ఞాపక శక్తోయ్!"
> "ఏం ప్రతిదీ మరిచి పోతుందా?"
> "లేదు ప్రతీదీ జ్ఞాపకం ఉంచుకుంటోంది!"
>
> నారం శెట్టి

బాగుంటాయండీ" అంది.

నేను ఉలిక్కిపడి "అదేమిటి ప్లేటు మళ్ళీ ఇలా ఫిరాయించావు?" అన్నాను.

"అదికాదు, ఊరికే చెబుతున్నా. మొదటి రోజున ఏదోలా అనిపించినా వాళ్ళ టీ.వీ. రానురానూ బాగుందనిపిస్తోంది. ఆ కలర్స్‌కి అలవాటు పడితే మామూలు టీ.వీ. చచ్చినా చూడలేం. మన పిల్లలు మన టీ.వీ. వదిలేసి, రాత్రయ్యేసరికి ఎదురింటి కెళ్ళి కూర్చుంటున్నారు. మనం కూడా కొందా మమ్మా అని ఒకటే గోల."

నే ననుకున్నంతా అయింది. మా ఆవిడ కలర్ టీ.వీ. వలలో పడింది.

"సరేలే నెల జీతంతో ఇల్లు గడవటమే కష్టంగా ఉంది గానీ కలర్ టీ.వీ. ఒకటా మనకి?" అని నిష్కర్షగా నా అభిప్రాయం చెప్పేసి, భోజనం ముగించి లేచాను.

అంతటితో ఆవిడ వదిలేస్తే మా ఆవిడ ఎందుకవుతుంది? రోజూ నా చెవిలో ఇల్లు కట్టుకుని పోరటం ప్రారంభించింది. ఎదురింట్లో టీ.వీ. చూడటంవల్ల తనూ, పిల్లలూ ఎలా లోకువైపోతున్నారో హృదయవిదారకంగా చెప్పింది. ఎదురింటావిడ గర్వం గురించి గుండె మండేట్టు వర్ణించింది. మేము కూడా కలర్ టీ.వీ. కొంటే ఆ వీధిలో మా పరువు ప్రతిష్ఠలు ఎంత పెరుగుతాయో, ఎదురింటావిడ మొహం ఎలా మాడిపోతుందో, కలర్‌లో సినిమాలు, బొమ్మలు చూస్తుంటే ఎంత రమ్యంగా ఉంటుందో కళ్ళకు కట్టినట్టు చెప్పింది. ఇన్‌స్టాల్‌మెంట్సు మీద ఎక్కడెక్కడ టీ.వీ.లు ఇస్తున్నారో ఆ ఇన్ఫర్మేషనంతా చెప్పింది. ఎలాగైతేనేం, వివరీతంగా గుప్పించిన యాంటీబయాటిక్స్ శరీరాన్ని శిథిలం చేసినట్టు నన్ను బలహీనుణ్ణి చేసి, సరే అనిపించింది.

ముందు మా ఇంట్లో ఉన్న నాలుగేళ్ళనాటి బ్లాక్ అండ్ వైట్‌ని మా ఆఫీసులో ప్యూనుకి అమ్మకానికి పెట్టాను. అతను పద్దెనిమిది వంద లిస్తానన్నాడు. కలర్ టీ.వీ. కొనాలంటే ముందు నాలుగు వేలు కట్టాలిట. మిగతా రెండు వేల రెండు వందలకోసం తన గాజుల జత తాకట్టు పెట్టటానికి మా ఆవిడ చాలా ఉదారంగా ఒప్పుకుంది. ప్యూను టీ.వీ. తీసుకుపోయాడు. ఇక నాలుగు వేలూ షాపులో డీలర్‌కి ఇచ్చి, కొత్త టీ.వీ. తెచ్చేసుకోటమే తరువాయి. మా ఇంటికి కలర్ టీ.వీ. వస్తోందని అప్పటికే వీధంతా తెలిసిపోయింది. మా ఆవిడ సంతోషం పట్టనలవి కాకుండా ఉంది.

అయితే విధిలీలలు ఊహించటం ఎవరితరం? మధ్యాహ్నం పిడుగులాంటి టెలిగ్రాం మా ఊర్నించి ఊడిపడింది. మా నాన్నగారు హఠాత్తుగా జబ్బు పడ్డారనీ, వైద్యంకోసం 'కనీసం' మూడు వేలు అయినా ఎలాగోలా సంపాదించి వెంటనే బయల్దేరమనీ మా చిన్న తమ్ము డిచ్చాడు.

నేను, నా కంటే ఎక్కువగా మా ఆవిడ ఇద్దరం నిర్విణ్ణులయిపోయాం. అయితే మాత్రం తప్పేదేముంది? ఇంట్లో ఉన్న డబ్బంతా పుచ్చుకుని వెంటనే బయల్దేరాం. మా నాన్నగారికి ఆపరేషను పూర్తయి, ఆయనకి గండం గడిచేసరికి నా చేతిలో చిల్లిగవ్వ కూడా మిగలలేదు.

మేము తిరిగివస్తున్న సమయంలో మా ఆవిడ నిట్టూరుస్తూ, "చూడండి. కొండనాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్నట్టుగా, కలర్ టీ.వీ. కోసం ప్లాన్ చేస్తే బ్లాక్ అండ్ వైట్ టీ.వీ. కూడా ఊడిపోయింది" అంది.

జరిగినదానికి త నెంత షాకయిందో తన మొహం చూస్తుంటేనే తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మాలాంటి వారికి ఆశ్రయమిచ్చేది వేదాంతమే తప్ప ఇంకోటి లేదని నాకు తెలుసు. అందుకే ఆవిణ్ణి ఊరడించటానికి ఆ వేదాంతమే ప్రారంభించాను.

"చూడు లక్ష్మీ! ఈ టీ.వీ.లు, ఈ ఆడంబరాలు ఇవన్నీ మానవుడు కల్పించుకున్న కృత్రిమ ఆనందాలు. ఇంతకన్నా విలువైన వెన్నో భగవంతుడు ఎంతో దయతో తనే స్వయంగా మనకి ప్రసాదించాడు. కేవలం డబ్బున్నవాడు మాత్రమే బొమ్మల్ని టీ.వీ.లో రంగుల్లో చూడగలడు. కానీ కళ్ళున్న ప్రతి మానవుడూ ఈ ప్రపంచాన్ని సప్తవర్ణాల్లోనూ చూడగలుగుతున్నాడు. దీన్ని బట్టి చూస్తుంటే దేవుణ్ణి మించిన సామ్యవాది మరొకడు లేడనిపిస్తోంది నాకు. ఇంత విలువయిన అవయవాలు, ఆరోగ్యం భగవంతుడు మన కిచ్చినప్పుడు వీటి సాయంతో కష్టపడి ఎప్పుడో అప్పుడు మానవుడు సృష్టించిన మిగతా ఆనందాలు మనం కొనుక్కోలేకపోం. కాబట్టి కాస్త ఓపిక పట్టు. నిరాశ పడి ప్రయోజనం ఏముంది?" అన్నాను అనునయంగా.

నా వేదాంతం మింగుడు పడిందో లేదో తెలియదు గానీ, మా ఆవిడ ఇంకేమీ మాట్లాడకుండా మౌనంగా కిటికీలోంచి ప్రకృతి అందాల్ని భగవంతు డిచ్చిన రెండు కళ్ళతో పరికించసాగింది. ●


## స్త్రీ హింస

మీ భర్త లేదా అత్తమామలు మిమ్మల్ని వేధిస్తున్నారా?

పరిష్కారం కోసం ప్రశ్నలు పంపవలసిన చిరునామా:

శ్రీమతి మమతా అనురాగ్, ఐ.పి.యస్.,
కేరాఫ్ ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక
ఎక్స్‌ప్రెస్ సెంటర్, దోమలగూడ
హైదరాబాద్ - 500 029